గంజాయి మత్తులో యువత

- చీకటి పడగానే నిర్మానుష్య ప్రదేశాల్లో వినియోగం
- పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా మారని వైనం
- హిల్స్‌లో పెరుగుతున్న కేసులు



బంజారాహిల్స్, మే26 (ఆంధ్రజ్యోతి): "బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10 జహీరానగర్‌లో ఖాళీ ప్రదేశం. రాత్రికాగానే చీకట్లో కొందరు యువకులు చేరి గంజాయి తీసుకుంటున్నారని పోలీసులకు ఫిర్యాదు అందింది. దాడులు నిర్వహించగా నలుగురు యువకులు గంజాయి తాగుతూ దొరికారు. వీరంతా 20 సంవత్సరాల్లోపు వారు కావడం గమనార్హం"

"ఫిలింనగర్‌లో బండరాళ్లతో నిండిన ఖాళీ ప్రదేశం అది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా బండరాళ్లను చాటు చేసుకొని కొంతమంది గంజాయి తాగుతున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించగా, ముగ్గురు వినియోగదారులు, ఓ అమ్మకందారుడు దొరికారు. బీటెక్ పూర్తి చేసిన అమ్మకందారుడు ఉద్యోగం రాకపోవడంతో గంజాయి అమ్మకానికి అలవాటు పడ్డాడు. వీరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు."

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్‌లో గంజాయి విక్రయాలు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయి. అక్రమ వ్యాపారానికి అలవాటుపడిన కొందరు గుట్టుచప్పుడు కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా చేసుకుని వాటిని నగరంలోని వ్యాపారులకు(డిస్ట్రిబ్యూటర్లకు) అందజేస్తున్నారు. డిస్ట్రిబ్యూటర్లు ఏరియాల వారీగా తమకు నమ్మకమైన వారిచే 5 నుంచి 10 గ్రాముల గంజాయిని చిన్న,చిన్న ప్యాకెట్లలో కావాల్సిన వారికి విక్రయిస్తున్నారు. కళాశాలలు, విద్యాసం స్థలు వ రా స్ ప బ్లిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు, స్విగ్గీ బాయిస్ ఎవరికీ అనుమానం రాకుండా బైక్‌పై వెళ్లి గంజాయి అవసరం ఉన్న వారికి అందజేస్తున్నట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌తోపాటు, హిల్స్, ఫిలింనగర్, మధురానగర్, బోరబండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వరుసగా నమోదవుతున్న గంజాయి కేసులను బట్టి వ్యాపారం ఎంత జోరుగా సాగుతుందనేది అర్థమవుతోంది.

పార్సిళ్ల రూపంలో రవాణా

గంజాయి కేసులో పట్టుబడ్డ వారు చెబుతున్న వివరాల ప్రకారం సరుకు ఎక్కడి నుంచి రవాణా అవుతుందో తెలియదని ఒక వ్యక్తి పలానా చోట ఇచ్చాడని అంతకు మించి తమకేమీ తెలియదని చెప్పడంతో పోలీసులకు ఏం చేయాలో అంతుచిక్కడం లేదు. కరడుగట్టిన గంజాయి వ్యాపారులు పోలీసులకు ఎలాంటి అనుమానం రాకుండా బీహార్, ఒరిస్సా తమిళనాడు, ఆంధ్రా ప్రాంతాల నుంచి అనుమానం రాకుండా ఆర్టీసీ, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీల ద్వారా పార్సిళ్లలో నగరానికి చేరవేస్తున్నట్టుగా సమాచారం. అక్కడి నుంచి ఎవరికీ అనుమానం రాకుండా కార్లు, బైక్‌లు, ఆర్టీసీ బస్సుల్లో శివారు ప్రాంతాలకు చేరుకుని ఫోన్ నంబర్ల ద్వారా మిగతా వ్యాపారులకు సరఫరా అవుతుంది. మరికొందరు పెద్ద మొత్తంలో డబ్బులు ఆశ చూపి యువకులను, యూత్ నాయకులను బినామీలుగా మార్చుకుని ఈ దందాకు వినియోగించుకున్నట్లు సమాచారం.

పెరుగుతున్న గంజాయి కేసులు

2024లో బంజారాహిల్స్‌లో 32 గంజాయి కేసులు నమోదయ్యాయి. ఎక్సైజ్ పోలీసులు 68 మందిని అరెస్టు చేసి వారి నుంచి 15.25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తాజాగా 2025 జనవరి 1 నుంచి మే 10 వరకు మొత్తం 12 కేసులు నమోదయ్యాయి. పట్టుబడిన 19 మంది నిందితుల నుంచి 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్‌లో గతేడాది 39 కేసులు, ఫిలింనగర్‌లో 23 కేసులు నమోదయ్యాయి.

బస్తీవాసుల ఆందోళన

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీసుస్టేషన్‌ల పరిధిలో బస్తీలు అధికంగా ఉన్నాయి. ఆయా బస్తీల్లో నిర్మాణుష్య ప్రదేశాలను ఎంచుకుంటున్న యువత అక్కడ గంజాయిని తీసుకుంటున్నారు. ఆరు నెలల క్రితం ఎమ్మెల్యే దానం నాగేందర్ ఫిలింనగర్‌లో పర్యటించినప్పుడు తమ పిల్లలను ఒంటరిగా ఇంట్లో వదిలి బయటకు రావాలంటే భయమేస్తుందని ఫిర్యాదు చేశారు. బస్తీల్లో గంజాయి అమ్మకాలు పెరిగిపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నట్టు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక పోలీసులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గస్తీ పెంచాలని ఆదేశించారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్.12 ఏసీబీ కార్యాలయం, జహీరానగర్‌లోని ఖాళీ ప్రాంతాల్లో గంజాయి గుప్పు గుప్పు మంటోంది. ఇక్కడ వినియోగదారులు పెరగడంతో అమ్మకందారులు కొన్ని సమయాల్లో సరఫరా చేసి వెళ్లిపోతున్నారు.

మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం



గంజాయి అమ్మకాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. అమ్మకందారుల కదలికలపై నిఘా పెడుతున్నాం. గంజాయి వినియోగిస్తున్న వారిపై కేసులు పెట్టడంతోపాటు మార్పు తీసుకువచ్చేందుకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లలపై దృష్టి పెట్టి వారి కదలికలను పర్యవేక్షించాలి. తప్పుదోవ పడుతున్నట్టు అనుమానం వచ్చిన వెంటనే వారికి అర్థమయ్యేలా చెప్పాలి.

- సామల వెంకట్‌రెడ్డి, బంజారాహిల్స్ ఏసీపీ



చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్లు రాజ్‌కుమార్, దేదీప్యరావు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

యూసుఫ్‌గూడ, మే 26 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్ డివిజన్‌లకు చెందిన 21 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్లు బండారి రాజ్‌కుమార్ పటేల్, దేదీప్యరావు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్‌దాస్, అమ్మాజీ, బాలు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, హబీబా సుల్తానా

పేదల పాలిట వరం

బోరబండ, మే 26 (ఆంధ్రజ్యోతి): షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు పేదల పాలిట వరం అని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా అన్నారు. ఖైరతాబాద్ మండల కార్యాలయంలో బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్లకు చెందిన 280 మందికి తహసీల్దార్ ఎం.డి.నయీముద్దీన్‌తో కలిసి సోమవారం వారు చెక్కులను పంపిణీ చేశారు. పేదింటి ఆడపిల్లల వివాహం తల్లిదండ్రులకు భారం కాకుండా ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తున్నదని తెలిపారు. బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్ల కాంగ్రెస్ నాయకులు, వివిధ బస్తీల నాయకులు పాల్గొన్నారు.



రింగ్ ఫైట్ ఛాంపియన్‌షిప్‌లో మెడల్స్ సాధించిన విద్యార్థులు

రింగ్‌ఫైట్‌లో సత్తాచాటిన ఫిలింనగర్ విద్యార్థులు

బంజారాహిల్స్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఫస్ట్ ఇంటర్నేషనల్ రింగ్ ఫైట్ ఛాంపియన్‌షిప్‌లో ఫిలింనగర్ విద్యార్థులు సత్తాచాటారు. దోమలగూడలో నాలుగు రోజులపాటు జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఫిలింనగర్ డ్రాగన్ కుంగ్‌ఫూ అకాడమీకి చెందిన పదిమంది విద్యార్థులు పతకాలు సాధించినట్లు గ్రాండ్ మాస్టర్ వెంకటేష్, మాస్టర్ హనీఫ్ తెలిపారు. నగరవ్యాప్తంగా 250 మందికి పైగా పాల్గొన్న ఈ రింగ్ ఫైట్ కాంపిటేషన్‌లో ఫిలింనగర్‌కు చెందిన టి.రాజేష్, ఎం.యశ్వంత్, పి.జ్ఞానేశ్వర్, కె.కపిల్‌దేవ్, సిహెచ్.చందు, కె.రవి క్రీతన గోల్డ్‌మెడల్ సాధించగా, కె.యశ్వంత్, కె.అభిరందన్ సిల్వర్ మెడల్స్, జె.వీక్షిత్, వి. వరుణ్ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. వీరిని ఘనంగా సత్కరించారు.

అనుమానంతో భార్యపై హత్యాయత్నం

బంజారాహిల్స్, మే 26 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో హత్యాయత్నం చేసిన భర్తపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిలింనగర్ జ్ఞానీ జైల్‌సింగ్‌నగర్‌లో నివసించే అప్పలరాజు, వెంకటరమణమ్మ దంపతులు. అప్పలరాజుకు భార్యపై చాలాకాలంగా అనుమానం ఉంది. ఇదే విషయంలో ఇద్దరి మధ్య తరుచూ గొడవలు జరిగేవి. ఈనెల 24న రాత్రి కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. స్థానికంగా ఉండే శ్యామ్ కలగజేసుకొని ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చాడు. మరుసటి రోజు మధ్యాహ్నం పని మీద శ్యామ్ ఇంటి నుంచి బయటకు రాగా, అప్పలరాజు కత్తితో ఇంట్లో నుంచి బయటకు రావడం గమనించాడు. వెంటనే శ్యామ్ ఇంట్లోకి వెళ్లి చూడగా వెంకటరమణమ్మ రక్తపు మడుగులో పడి ఉండడం చూశాడు. తన భర్త తనను పొడిచాడని వెంకటరమణమ్మ చెప్పింది. శ్యామ్ 108కు ఫోన్ చేసి అంబులెన్స్ ద్వారా ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించాడు. శ్యామ్ ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు అప్పలరాజుపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్యాబ్ అటకాయించి బెదిరింపులు

బంజారాహిల్స్, మే 26 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ప్రయాణిస్తున్న క్యాబ్‌ను ఆపి ముగ్గురు వ్యక్తులు బెదిరించడమే కాకుండా వాహనం అద్దాలు పగలగొట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ సయ్యద్‌నగర్‌కు చెందిన కొల్లూరి లక్ష్మీప్రసన్న ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ప్రతి రోజూ నలుగురు ఉద్యోగులు ఉన్న క్యాబ్‌లో ఇంటికి వెళ్తుంది. ఈనెల 26న తెల్లవారుజామున బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 నుంచి వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు మద్యం తాగుతూ క్యాబ్‌ను అడ్డుకున్నారు. ఓ వ్యక్తి కారు అద్దాలు పగలగొట్టాడు. మరో ఇద్దరు ఉద్యోగుల మీదకు వెళ్తూ బెదిరించారు. వారి నుంచి తప్పించుకున్న లావణ్య బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటికి రమ్మని పిలిచి దాడి

బంజారాహిల్స్, మే 26 (ఆంధ్రజ్యోతి): గృహిణికి దగ్గరవుతున్నాడని తెలుసుకొని అతడిని ఇంటికి పిలిచి మరీ దాడి చేసి గాయపర్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌కు చెందిన ఆర్యజైచంద్ర ఓ సంస్థలో ఫీల్డ్ అసిస్టెంట్. కొంతకాలం క్రితం లావణ్య అనే మహిళతో పరిచయం ఏర్పడింది. లావణ్య భర్త ఆమెను సరిగ్గా చూసుకోకపోవడంతో వేరుగా ఉంటుంది. ఆమె బాగోగులను ఆర్యజైచంద్ర చూసుకునేవాడు. ఈ విషయం లావణ్య భర్తకు తెలియడంతో ఆయన ఫోన్‌లో వారిని తిట్టేవాడు. ఇదిలా ఉండగా, ఈనెల 25న లావణ్య కుమార్తె ఆర్యజైచంద్రకు ఫోన్‌చేసి ఇంటికి రావాలని కోరింది. ఆర్య ఒప్పుకోలేవు. చివరకు ఒత్తిడి పెరగడంతో బంజారాహిల్స్ రోడ్డునెంబర్.7 దూద్‌ఖానా బస్తీలోని లావణ్య ఇంటికి వెళ్లాడు. అక్కడే ఉన్న లావణ్య కుటుంబసభ్యులు మూకుమ్మడిగా ఆర్యపై దాడి చేశారు. చేతికి దొరికిన వస్తువులతో కొట్టారు. ఈ గలాటలో అతడి మెడలో చైన్ కనిపించకుండా పోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పార్కింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనం చోరీ

బంజారాహిల్స్, మే 26 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్‌లో పెట్టిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.2 షౌకత్‌నగర్‌కు చెందిన ఉపేందర్ సింగ్ కారు డ్రైవర్. ఈనెల 24న విధులు ముగించుకొని ఇంటికి వచ్చాడు. తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట పార్కింగ్‌లో పెట్టాడు. మరుసటి రోజు చూడగా వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



నాలా పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

నాలాల్లో పూడికతీత పనులను పూర్తి చేయాలి

- కార్పొరేటర్ మహేశ్వరి

బేగంపేటపే, మే 26 (ఆంధ్రజ్యోతి): నాలాల్లో పూడికతీత పనులను వేగంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ టి.మహేశ్వరి అన్నారు. సోమవారం డివిజన్‌లోని మయూరిమార్గ్ ప్రాంతంలోని కూకట్‌పల్లి నాలాలో చేపట్టిన పూడికతీత పనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. వర్షాలు ప్రారంభం కావడంతో వరదలు వచ్చే అవకాశాలు ఉన్నందున పనులను త్వరగా పూర్తి చేయాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి, నరేష్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక డ్రైవ్

- కిలోమీటర్‌కు 14 మంది కార్మికులతో పనులు
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



ప్రీ మాన్‌సూన్ యాక్షన్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, మే 26 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో తలెత్తే పారిశుధ్య సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. ఇందుకోసం కిలోమీటర్‌కు 14 మంది పారిశుధ్య కార్మికులను వినియోగించనున్నట్టు చెప్పారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 ఎన్‌బీటీనగర్ ప్రీ మాన్‌సూన్ శానిటేషన్ డ్రైవ్‌ను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇంట్లో ఉన్న చెత్తను తప్పనిసరిగా స్వచ్ఛఆటోలకు ఇవ్వాలని, బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని సూచించారు. భవన నిర్మాణ వ్యర్థాలు కూడా రోడ్లపై వేయవద్దని, జీహెచ్ఎంసీ సీ అండ్ డీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ వారికి ఫోన్ చేస్తే వారే తీసుకొని పోతారని తెలిపారు. దోమలు బెడదను నివారించేందుకు ముందస్తుగానే అన్ని కాలనీల్లో ఫాగింగ్ చేయనున్నట్టు చెప్పారు. అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ మాట్లాడుతూ ప్రీ శానిటేషన్ డ్రైవ్ ప్రతీ డివిజన్‌లో మూడు రోజులపాటు ఉంటుందని తెలిపారు. జలమండలి జీఎం హరిశంకర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు, కార్మికులకు భద్రత కల్పించేందుకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ వర్షాలు ముందుగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు, ఫాగింగ్ లాంటి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ప్రజలు సహకరిస్తే క్లీన్ వార్డుగా చేస్తామన్నారు. నీటినిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో కోర్ కమిటీ ఎన్నికలు

పంజాగుట్ట, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పద్ధతిలో కోర్ కమిటీ ద్వారా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్(ఏఐబీఎస్ఎస్) జాతీయ అధ్యక్షుడి ఎన్నికలు జరిగాయని సంఘ్ జాతీయ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్ అన్నారు. కొంతమంది ఎన్నికలు అడ్డుకోవడానికి ప్రయత్నించినా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన జాతీయ కార్యవర్గ సభ్యులలో అత్యధికులు నూతన అధ్యక్షుడిగా మహారాష్ట్రకు చెందిన టీసీ రాథోడ్‌ను ఎన్నుకున్నారని ఆయన తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘ్ జాతీయ, రాష్ట్ర నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. 1953లో తమ సంస్థ ఏర్పడిందని తెలిపారు. ఈ నెల 25న మింట్ కాంపౌండ్‌లోని గిరిజన విద్యుత్ భవన్‌లో ఏఐబీఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి రమేష్ ఆర్య అధ్యక్షతన ఎనిమిది మందితో కూడిన కోర్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. మొత్తం 51 మంది జాతీయ కార్యవర్గ సభ్యులు ఉండగా, ఎనిమిది మంది తమ మధ్య లేకపోగా ప్రస్తుతం 43 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 36 మంది సభ్యులు ఈ ఎన్నికలలో పాల్గొనడానికి హాజరయ్యారని తెలిపారు. టీసీ రాథోడ్‌తో పాటు మరో వ్యక్తి అధ్యక్ష పదవి కోసం పోటీ పడ్డారని తెలిపారు. పోటీలో ఉన్న ఆ వ్యక్తి ఓడిపోతానని గ్రహించి ఎన్నికలు నిలుపుదల చేయడానికి అతడి వర్గీయులు, సంస్థకు సంబంధం లేని వారు అలజడి సృష్టించారని ఆరోపించారు. అనంతరం కోర్ కమిటీ ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో సజావుగా సమావేశం జరిగిందని, ప్రజాస్వామ్య పద్ధతిలో 36 మంది జాతీయ కార్యవర్గ సభ్యులలో 25 మంది డాక్టర్ టీసీ రాథోడ్‌కు మద్దతుగా సంతకాలు చేశారని, దీంతో ఎన్నికల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అమర్ సింగ్ తిలావత్

సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు టీసీ రాథోడ్ తెలిపారు. సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు సూరజ్ పాల్, రఘు, ఎన్.టి జాదవ్, రిటైర్డ్ ఎస్పీ రవీంద్రనాయక్, రామారావు భాటి గావుకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో టీసీ
అడిగితే లొల్లి..!

- అంగీకార పత్రం చూపించి ఎదురు ప్రశ్నలు
- పిల్లల తల్లిదండ్రులపై నిర్వాహకుల కస్సు బుస్సు

> శ్రీలేఖ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తన భర్త వెంకటేశ్వరరావుతో కలిసి సర్దార్‌పటేల్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. తనకు వర్క్‌ఫ్రం హోమ్ కావడంతో గత రెండేళ్లుగా తన కుమార్తెను ఇంటికి సమీపంలో స్టేట్ సిలబస్ ఉన్న స్కూల్లో జాయిన్ చేశారు. ఇప్పుడు వారానికి మూడురోజులు ఆఫీస్‌కు రావాల్సి ఉంటుందని సమాచారం ఇచ్చారు. టీసీ ఇస్తే ట్రాన్స్‌పోర్ట్ ఉన్న స్కూల్లో జాయిన్ చేస్తామని చెబుతున్నా ఇప్పుడు అడిగితే ఎలా? అని స్కూల్ నిర్వాహకులు ఎదురు ప్రశ్నిస్తున్నారు.

> అభిరామ్, ఆరాధ్య ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. కేపీహెచ్‌బీలో నివాసం ఉంటూ సమీపంలోని ఓ కార్పొరేట్ స్కూల్లో కూతుర్ని జాయిన్ చేశారు. ఇప్పుడు నాలుగో తరగతి చదవాల్సి ఉంది. ఇప్పుడు వారు సీబీఎస్‌ఈ సిలబస్ స్కూల్లో జాయిన్ చేద్దామంటే టీసీ ఇచ్చేందుకు సదరు పాఠశాల నిర్వాహకులు సుముఖంగా లేరు. దీంతో కుటుంబం ఏం చేయాలో అర్థం కాక ఇబ్బందులు పడుతుంది.

కేపీహెచ్‌బీకాలనీ, మే 26 (ఆంధ్రజ్యోతి): పైన పేర్కొన్న రెండు కుటుంబాలే కాదు.. ఎలా వందలాది కుటుంబాలు పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఆందోళన చెందుతున్నారు.

అన్నిచోట్లా ఇదే పరిస్థితి

గతంలో తెలిసో తెలియకనో ప్రాథమిక దశలో చిన్నారులను ఇంటికి లేదా ఆఫీస్‌కు సమీపంలో జాయిన్ చేసిన వారు ఎందరో. కానీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సహోద్యోగుల సూచనలతో స్టేట్ సిలబస్ నుంచి సెంట్రల్ సిలబస్‌కు మార్చేందుకు మొగ్గుచూపుతున్నారు. ఎగువ మధ్యతరగతి వారు అలా ఆలోచిస్తుంటే దిగువ మధ్య తరగతి వారు మాత్రం ఎక్కడ కాస్త ఫీజు తక్కువగా ఉంటే అక్కడ జాయిన్ చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. మధ్యతరగతి వారు మాత్రం ఉన్న దాంట్లో కాస్త పర్వాలేదు అనే దానికి ఓటేస్తున్నారు. ఎవరి స్తోమతకు తగ్గ విధంగా వారు పాఠశాలలను మార్చుకునేందుకు వేట ప్రారంభించారు. ఇదే సమయంలో ఆయా స్కూల్స్ నిర్వాహకుల నుంచి టీసీ ఇచ్చేందుకు పెడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. స్కూల్ మారేందుకు మీరు ఎందుకు ఆలోచిస్తున్నారు అనే కోణంలో అడగకుండా కస్సుబుస్సు లాడటంతో చిన్నారుల తల్లిదండ్రులకు కాస్త చికాకు పుట్టిస్తుందని చెప్పవచ్చు. చాలా వరకు జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే మీరు ఇదే స్కూల్లో 2025-26కు కంటిన్యూ చేస్తారా లేదా అని పిల్లల తల్లిదండ్రుల నుంచి ఓ అంగీకార పత్రాలు తీసుకున్నారు. దీన్ని సాకుగా చూపించి టీసీ కోసం వెళ్లిన పిల్లల తల్లిదండ్రులకు కనీసం గౌరవం కూడా ఇవ్వకుండా అప్పటి వరకు సార్.. మేడం అని సంబోధించిన వారు సైతం కోపంతో ఊగిపోతున్నారు. ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ అడగటమే మేం చేసిన నేరమా? వేరే స్కూల్లో జాయిన్ చేసుకునే హక్కు మాకు లేదా ? సీబీఎస్‌సీకి మార్చుకోకూడదా? మేం ఇల్లు మారాం.. మాకు దగ్గర్లో ఉన్న స్కూల్లో జాయిన్ చేసుకుంటాం ఇలా ఏం చెప్పినా ఆలకించడం లేదని కేపీహెచ్‌బీ ఆరోఫేజ్‌లో నివాసం ఉంటే శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.



టీసీ అడిగితే ఇవ్వాల్సిందే

పాఠశాల ప్రారంభానికి ముందే ప్రభుత్వ ప్రైవేటు, కార్పొరేట్ ఇలా ఏ స్కూల్ అయినా సరే టీసీ అడిగితే ఇవ్వాల్సిందే. పిల్లల తల్లిదండ్రులు టీసీ అడుగుతున్నారంటే సదరు పాఠశాల నిర్వాహకులు సకాలంలో ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ ఇవ్వాలి. హౌస్ షిఫ్టింగ్, ఆఫీస్ ఛేంజ్ వల్ల కూడా పిల్లలను వారికి అనుకూలంగా ఉన్న చోట చేర్పించుకుంటారు. గతంలో అంగీకార పత్రాలు ఇచ్చినా పిల్లల తల్లిదండ్రుల పరిస్థితిని కూడా అర్థం చేసుకొని వారిని ఇబ్బందులకు గురిచేయరాదు. స్టేట్ సిలబస్ అయితే ఎంఈవో, డీఈవో దృష్టికి తీసుకెళ్లవచ్చు. సీబీఎస్‌సీ, ఐసీఎస్‌సీ ఇతరత్రా సిలబస్ పాఠశాలలకు చెందిన వారు సంబంధిత శాఖల అధికారులకు ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చు.

- కిషన్, ఎంఈవో, కూకట్‌పల్లి మండలం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కృష్ణ



జి.కృష్ణ

హైదర్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 4వ మహాసభలు ఈసీఐఎల్‌లోని బంజార ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించడం జరిగింది. ఈ సభలో జిల్లా కార్యవర్గ సభ్యుడిగా జి.కృష్ణ ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ సత్యం, సాయిలుగౌడ్, వీఎస్‌బోస్, ఉమామహేష్‌కు కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని, కూకట్‌పల్లి నియోజవర్గంలో పేదలకు ఇందిరమ్మ ఇల్లు, అర్హులకు రేషన్‌కార్డులు, దివ్యాంగులకు పింఛన్లు తదితర సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

కారును ఢీకొన్న బైక్

యూసుఫ్‌గూడ, మే 26 (ఆంధ్రజ్యోతి): పార్కులోకి వెళ్లి వచ్చే సరికి కారును బైక్ ఢీకొట్టింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి దుర్గానగర్‌కు చెందిన దొంతుల సంతోష్ కృష్ణకాంత్ పార్కుకు వచ్చాడు. మారుతి కారు(టిఎస్08 ఈటి7173)ను పార్కింగ్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనం(టిఎస్08కెఎ9628)పై వేగంగా వచ్చి కారును ఢీకొట్టాడు. గాయపడిన ద్విచక్ర వాహనదారుడిని 108లో ఆస్పత్రికి తరలించారు. సంతోష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



మహిళా సంఘాల సభ్యులకు కోటి 10 లక్షల రూపాయల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

● ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి) :కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సోమవారం మారేడుపల్లి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో మెప్మా అధికారులు, బ్యాంకు మేనేజర్లు, మహిళా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇందిరా మహిళాశక్తి కింద రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంలో భాగంగా కంటోన్మెంట్ మహిళలను కోటీశ్వరులను చేయడమే తన లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా, బ్యాంకు అధికారులు ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న పథకాలను వినియోగించుకునే విధానాన్ని మహిళా సంఘాల సభ్యులకు వివరించారు

మరమ్మతులు చేస్తున్నాం: సీఐ మధుకుమార్

అడ్డగుట్ట, మే 26 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో కొన్నిచోట్ల సీసీ కెమెరాలు పనిచేయడంలేదని, మరమ్మతులు చేస్తామని గోపాలపురం పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో నిఘా నేత్రాల జాడేది? అనే శీర్షికన ప్రచురితం కావడంతో సీఐ స్పందించారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, రెజిమెంటల్ బజారు, సికింద్రాబాద్, క్లాక్‌టవర్, సంగీత్ చౌరస్తా సమీపంలో ఇప్పటివరకు 6477 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా వీటిలో 6051 మాత్రమే పనిచేస్తున్నాయని, 426 సీసీ కెమెరాలు పనిచేయడంలేదన్నారు. పూర్తిస్థాయిలో వీటిని బిగించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మట్టి కుప్పలను తొలగించాలి

బౌద్ధనగర్, మే 26(ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయం వద్ద రోడ్డుపై ఉన్న మట్టికుప్పలను తొలగించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు. నాలుగురోజుల క్రితం జీహెచ్‌ఎంసీ సిబ్బంది మ్యాన్‌హోల్స్‌ను నుంచి మట్టిని తీసి రోడ్డు మీద కుప్పలుగా పోశారు. అలాగే కనకదుర్గ ఆలయం నుంచి వారాసిగూడ ప్రధాన రహదారి వరకు మ్యాన్‌హోల్స్ నుంచి తీసిన మట్టిని రోడ్డుపక్కన పడవేశారు. దీంతో వాహనదారులు, ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టికుప్పలను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయం వద్ద రోడ్డుపై ఉన్న మట్టికుప్పలు

తిరుమలగిరి తహసీల్దార్‌గా భిక్షపతి



తిరుమలగిరి మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి మండల కార్యాలయం తహసీల్దార్‌గా భిక్షపతిని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ నియమించారు. ఇక్కడ పనిచేసిన అశోక్‌కుమార్ ఏప్రిల్ 30న పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న హారికను ఎఫ్ఏసీగా నియమించారు. భిక్షపతి సంగారెడ్డి జిల్లా నుంచి వచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. పౌరులకు మెరుగైన సేవలు అందిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఐఎంఏ వైస్ చైర్మన్‌గా కృపాల్‌సింగ్



అడ్డగుట్ట, మే 26(ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఫోరెన్సిక్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న కృపాల్‌సింగ్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైస్‌చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో సెంట్రల్‌కమిటీ హాలులో జరిగిన ఐఎంఏ సాధారణ సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని నామినేట్ చేశారు. ఐఎంఏ వైస్‌చైర్మన్‌గా నియమితులైన కృపాల్‌సింగ్‌ను వైద్యులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ అభినందించారు.



జగన్నాథ గోశాల ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

జగన్నాథ ఆలయంలో భక్తుల భజన

అడ్డగుట్ట, మే 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మహేంద్రాహిల్స్‌లోని జగన్నాథ గోశాల ఆలయంలో భక్తులు భజన చేశారు. ఇటీవల అనారోగ్యంతో కాలం చేసిన ఆధ్యాత్మిక గురువు భక్త సౌరబ్ నారాయణ మహరాజ్ జ్ఞాపకార్థం ఆలయంలో భక్తులు భజన, గురుహారతి, నగర్ సంకీర్తన్, హరినాం సంకీర్తన్, భోగిహారతి, రాజ్‌భోగి హారతి వంటి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లపై పట్టింపేది?

● ప్రధాన రహదారులపైనే దృష్టి
● పట్టించుకోని కంటోన్మెంట్ బోర్డు



కంటోన్మెంట్ వర్క్‌షాప్ సమీపంలో



పికెట్ సంతోషిమాత ఆలయం వద్ద

సికింద్రాబాద్, మే 26(ఆంధ్రజ్యోతి): అసలే అరకొర బడ్జెట్. అటు కేంద్రం నుంచి, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందుతున్న ఆర్థిక సహకారం అంతంత మాత్రమే. ఓ దశలో ఉద్యోగుల జీతాలు చెల్లించడం కూడా గగనంగా మారిన దుస్థితి. ఈ గడ్డు పరిస్థితులను అతికష్టం మీద అధిగమిస్తూ ప్రజా సమస్యలను, అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతూ వస్తోన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కొద్దికాలంగా అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు తలెత్తుతున్నాయి. అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమానికి భిన్నంగా చేపడుతోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కంటోన్మెంట్‌లోని 8 వార్డుల్లోని కాలనీలు, బస్తీల్లో పలుచోట్ల అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. నిరుపేదలు నివసించే బస్తీలు మొదలు సంపన్నులు ఉండే కాలనీల వరకు.. అనేకచోట్ల రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గుంతలు పూడ్చాలని, అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలని, అవసరమైన చోట్ల ప్యాచ్ వర్క్స్ చేయాలని ప్రజా ప్రతినిధులు, బోర్డు అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే వారి అభ్యర్థనలు బుట్టదాఖలవుతున్నాయని చెబుతున్నారు. అంతర్గత రోడ్ల గురించి పట్టించుకోకుండా కేవలం ప్రధాన రహదారుల నిర్మాణం, నిర్వహణపై దృష్టి సారిస్తున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



తాడ్‌బండ్ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని కాలనీలో

ప్రధాన రహదారుల నిర్మాణం, నిర్వహణను తాము వ్యతిరేకించడం లేదని, అయితే అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉంటే వాటికి మొదటి ప్రాధాన్యతనివ్వకపోవడాన్ని ప్రశ్నిస్తున్నామని పలు కాలనీలు, బస్తీల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ వ్యాఖ్యలు చేస్తున్న వారంతా.... రహదారుల నిర్మాణం, నిర్వహణ పనులు చేపట్టేవారు కావడం గమనార్హం. ప్యాచ్ వర్క్స్ చేయడానికి అయ్యే వ్యయం కూడా తక్కువగా ఉంటుందని, పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును గాడిన పెట్టడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ తక్షణమే ఈ అంశానికి ప్రాధాన్యతనివ్వాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద చొరవ తీసుకుని ప్రజల అవసరాలను, ప్రాధాన్యతలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



విక్రంపురిలో

రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి) : జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నాయకత్వంలో 2001లో టీఆర్ఎస్ పార్టీ ఏర్పడిందని తెలిపారు. అనేక పోరాటాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని వివరించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రిగా కేసీఆర్ నాయకత్వంలో ఎంతో అభివృద్ధి చేసుకున్నామని, దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. అంతటి విశిష్టత గల జూన్ 2ను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, బాల్‌రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, హరికృష్ణ, హన్మంతరావు, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, నాయకులు అశోక్ యాదవ్, శ్రీహరి, సంతోష్ కుమార్, ప్రవీణ్ రెడ్డి, కిషోర్, నాగులు, లక్ష్మీపతి, రమణ, శేఖర్, ఆరీఫ్, శ్రీకాంత్ రెడ్డి, ఖలీల్, నర్సింహ, బలరాం తదితరులు పాల్గొన్నారు.



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అడ్డుగా ఉన్న రెయిలింగ్‌ను తొలగించాలి



ఫుట్‌పాత్‌పై అడ్డుగా ఉన్న రెయిలింగ్



వాహనాల మధ్య నుంచి వెళ్తున్న ప్రయాణికులు

రెజిమెంటల్‌బజార్,మే 26 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పైకి వెళ్లకుండా అడ్డుగా రెయిలింగ్ ఉండటంతో పాదచారులు వాహనాల మధ్యలో నుంచి ప్రమాదకరంగా నడవాల్సిన పరిస్థితి నెలకొంది. సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రోస్టేషన్ మెట్ల మార్గం వద్ద రామక్రిష్ణ హోటల్ వైపు ఉన్న ఫుట్‌పాత్ నుంచి నేరుగా రోడ్డు మీదకు రాకుండా మెట్రో రైల్వే సంస్థ రెయిలింగ్‌ను నిర్మించింది. రక్షణపరంగా ఇది బాగున్నప్పటికీ రైల్నిలయం వైపు దారి వద్ద ఫుట్‌పాత్‌పైకి వెళ్లేలా దారిని వదలకుండా రెయిలింగ్ నిర్మించారు. దీంతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వైపు రాకపోకలు సాగించే ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. జీబ్రాలైన్‌పై నుంచి రోడ్డు దాటిన వారు ఫుట్‌పాత్ మీద రెయిలింగ్ అడ్డుగా ఉండటంతో వాహనాల మధ్య నుంచి వెళ్లాల్సివస్తోంది. నడవడానికి అడ్డుగా రెయిలింగ్‌ను తొలగించి దారి ఏర్పాటు చేసి, ద్విచక్ర వాహనాలు ఫుట్‌పాత్‌పైకి రాకుండా సిమెంట్ దిమ్మెలు నాటితే పాదచారులకు సౌకర్యంగా ఉంటుంది.

ఓయూ ప్రొఫెసర్స్ క్వార్టర్స్ లీజును రద్దు చేయాలి

● రిజిస్ట్రార్‌కు ఏబీవీపీ, బీఆర్ఎస్వీ నాయకుల వినతి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 26(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ సమీపంలో ఆర్టీసీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ప్రొఫెసర్ క్వార్టర్స్‌ను అది ధ్వని సంస్థకు 30 సంవత్సరాల లీజుకు ఇవ్వాలనే ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని ఏబీవీపీ, బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఓయూ రిజిస్ట్రార్ నరేష్ రెడ్డికి సోమవారం వేరు వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ, బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ యూనివర్సిటీ భూముల విషయంలో జస్టిస్ చిన్నప్ప రెడ్డి కమిషన్‌కు ఇది విరుద్ధం అన్నారు. 2400 ఎకరాలు ఉన్న యూనివర్సిటీ భూములు 1300 ఎకరాలకు తగ్గిపోయాయని, ఈ భూములను కాపాడాల్సిన అధికారులే ప్రైవేటు వ్యక్తులకు క్వార్టర్స్ లీజుకు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. క్వార్టర్స్‌లో ఉండే ప్రొఫెసర్స్‌కు హెచ్‌ఆర్ రూ.40 వేలు కట్ చేసి, బయటి వ్యక్తులకు మాత్రం కేవలం వెయ్యి రూపాయలకే లీజుకు ఇవ్వడం వెనుక ఆంతర్యమేమిటో యూనివర్సిటీ అధికారులు బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వి తేజ, జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అలివేలి రాజు, రాష్ట్ర కార్యసమితి సభ్యులు కమల్ సురేష్, యూనివర్సిటీ అధ్యక్షుడు దృహన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శులు జంగయ్య, ప్రశాంత్, నాయకులు మిథున్, నాగేందర్ రావు, అవినాష్, వినోద్, సతీష్ పాల్గొన్నారు.



తహసీల్దార్ పాండు నాయక్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

పద్మారావునగర్, మే 26(ఆంధ్రజ్యోతి): బోయగూడలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనపర్చుకోవాలని డివిజన్ బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు విన్నవించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ న్యూబోయగూడ ఐడీహెచ్ కాలనీ నల్లపోచమ్మ దేవాలయం సమీపంలో ఉన్న స్థలాన్ని అధికారులు స్వాధీనపర్చుకుని, సూచిక బోర్డును ఏర్పాటుచేయాలని కోరుతూ బీజేపి మహంకాళి, సికిందరాబాద్ జిల్లా కౌన్సిల్ సభ్యులు గుంటి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం సికింద్రాబాద్ మండల తహసీల్దార్ పాండు నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమస్యపై వెంటనే స్పందించి, స్థలాన్ని పరిశీలించి చర్యలు చేపట్టని పక్షంలో, మాజీమంత్రి, బీజేపీ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి స్థలాన్ని కాపాడటానికి కృషి చేస్తామని తెలిపారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో తుమ్మల శ్రీకాంత్, కిరీట, రఘునాథ్‌గౌడ్, మంచాల గోపి, వికాస్, నరేశ్, అనిత, వంశి, వినకృష్ణ, ఇందుమతి ఉన్నారు.

సికింద్రాబాద్‌లో అమలాపురం వాసి అదృశ్యం



వెంకట రమణ

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : వైద్యం కోసం వచ్చిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం అమలాపురం ప్రాంతానికి చెందిన వెంకట రమణ (79) తన సోదరితో కలిసి వైద్యం కోసం ఈ నెల 17న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం-2లో దిగారు. ఆ తర్వాత బయటకు వెళ్లే క్రమంలో వెంకట రమణ కనిపించకపోవడంతో అతని సోదరి రైల్వేస్టేషన్‌లో గాలించినా ఫలితం లేకపోవడంతో బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి జరిగిన విషయం తెలిపింది. వెంటనే సోదరుడు సత్యనారాయణ సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఈ విషయమై ఫిర్యాదు చేశాడు. రైల్వే పోలీసులు డీడీ ఎంట్రీ చేసిన అనంతరం పదిరోజుల సీసీ ఫుటేజీలను పరిశీలించినా ఫలితం లేకపోవడంతో 26న వెంకటరమణపై మిస్సింగ్ కేసు కింద నమోదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన ఆ నలుగురూ సేఫ్

● ఆత్మహత్యాయత్నం.. కాపాడిన బోయినపల్లి పోలీసులు



బోయినపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి) : ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ముగ్గురు పిల్లలు అదృశ్యమైన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వారం రోజుల క్రితం కలకలం రేపింది. బోరబండకు చెందిన పల్లపు అనితకు ఓల్డ్ బోయినపల్లికి చెందిన చెంచయ్యతో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ధనుష్ కుమార్, ఇద్దరు కుమార్తెలు లక్ష్మీ మానస, అమీనాలు ఉన్నారు. భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉండటంతో తరచుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై భార్యాభర్తల మధ్య ఈ నెల 21న కూడా గొడవలు జరగడంతో జీవితంపై విరక్తి చెందిన బాధితురాలు తన పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త అనిత సోదరి లక్ష్మీ ప్రసన్నకి ఫోన్ చేసి నీ సోదరి ఇంటికి వచ్చిందా అని అడగడంతో ఆమె తెలియదని చెప్పింది. మరుసటి రోజు సోదరి ఇంటికి వెళ్లి చూడగా ఆమె తన పిల్లలతో సహా ఇంటి నుంచి వెళ్లిపోయిందని గ్రహించింది. దీంతో ఈ నెల 23న సోదరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న బోయినపల్లి పోలీసులు సీసీ కెమెరాలు, ఆమె సెల్‌ఫోన్ డేటా సేకరించి పిల్లలు, అనిత మరో సోదరి ఇంట్లో ఉన్నట్లు గుర్తించారు. ఆమె సమాచారంతో బోయినపల్లి పోలీసులు తల్లితో పాటు ముగ్గురు పిల్లలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి భర్తకు కౌన్సిలింగ్ ఇచ్చారని సమాచారం. అనంతరం తదుపరి విచారణ నిమిత్తం భార్యాభర్తలను, పిల్లలను పోలీస్ స్టేషన్‌కు తరలించారని, కాగా అప్పటికే తల్లి, ముగ్గురు పిల్లలతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నారని తెలుసుకున్న సోదరి పోలీసులకు తెలియజేసింది. దీంతో పోలీసులు వారికి నచ్చజెప్పి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని సమాచారం.

యువకుడి ప్రాణాలను బలిగొన్న మద్యం మత్తు



పవన్‌కుమార్ (ఫైల్)

రామంతాపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో చోటుచేసుకున్న చిన్నపాటి వివాదం ఓ యువకుడి ప్రాణాలను బలిగొన్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామంతాపూర్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామంతాపూర్ గుడ్ డే బార్‌లో ఆదివారం రాత్రి అంబర్‌పేట్ పటేల్‌నగర్‌కు చెందిన హరి, పవన్ కుమార్, శ్రవణ్ అనే స్నేహితులు మద్యం తాగారు. ఈ నేపథ్యంలో ఏదో విషయమై హరి, శ్రవణ్ గొడవకు దిగారు. దీంతో పవన్ గొడవ ఆపేందుకు ప్రయత్నించాడు. కోపంతో శ్రవణ్ పవన్ కుమార్ తలపై బీర్ సీసాతో కొట్టడంతో పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించాలి

● ప్రజావాణిలో వినతి

అడ్డగుట్ట, మే 26 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్ సుభాష్ విగ్రహం నుంచి రియో పాయింట్(నందనార్‌నగర్) వరకు రోడ్డు వెడల్పు చేయాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు, గంగారాంలు సోమవారం సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మీడియాతో మాట్లాడుతూ గత కొన్నేళ్ల క్రితం తుకారాంగేట్ సుభాష్ విగ్రహం నుంచి రియో పాయింట్ హోటల్ (నందనార్‌నగర్) వరకు సగం రోడ్డు మాత్రమే వెడల్పు చేసి నిలిపివేశారని, మిగితా 50 ఫీట్ల వరకు రోడ్డు వెడల్పు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నామన్నారు. గతంలో ఇదే విషయంపై జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశామని రెండు రోజుల క్రితం జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయం నుంచి లేఖ వచ్చిందని తెలిపారు. సోమవారం ప్రజావాణిలో సంప్రదించాలని అధికారులు చెప్పడంతో అధికారులను కలిశామన్నారు. రోడ్డు వెడల్పు చేయకపోవడం కారణంగా సికింద్రాబాద్ నుంచి తుకారాం గేట్ వరకు వచ్చే ఆర్టీసీ బస్సులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో సికింద్రాబాద్ నుంచి ఈసీఐఎల్, లాలాపేట్, మెట్టుగూడ, హనుమాన్‌పేట్ వైపు వెళ్లే వాహనాలు తుకారాంగేట్ మీదుగా వెళ్లాల్సి వస్తుండడంతో ఇక్కడ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని జీహెచ్‌ఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇక్కడ రోడ్డు వెడల్పు పనులు చేపడితే సులువుగా ప్రయాణం చేయవచ్చన్నారు. అలాగే మంగళవారం వారంతపు సంత నిర్వహిస్తుండడంతో మరింత ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదన్నారు. అధికారులు రోడ్డు వెడల్పు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, అదేవిధంగా రోడ్డు వెడల్పులో ఇళ్ల కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరామని తెలిపారు.



రోడ్డు వెడల్పు చేయాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవి కిరణ్ కు వినతిపత్రం సమర్పిస్తున్న నర్సింగ్‌రావు, గంగారాం



నాలా పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

నాలాల్లో పూడికతీత పనులను పూర్తి చేయాలి

● కార్పొరేటర్ మహేశ్వరి

బేగంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): నాలాల్లో పూడికతీత పనులను వేగంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ టి.మహేశ్వరి అన్నారు. సోమవారం డివిజన్‌లోని మయూరిమార్గ్ ప్రాంతంలోని కూకట్‌పల్లి నాలాలో చేపట్టిన పూడికతీత పనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. వర్షాలు ప్రారంభం కావడంతో వరదలు వచ్చే అవకాశాలు ఉన్నందున పనులను త్వరగా పూర్తి చేయాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి, నరేష్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.